ప్రమాదకరంగా లోలెవల్ వంతెన

- వర్షాలు, సాగర్ కాలువ నీళ్లతో తరచూ జలమయం అవుతున్న పొట్లపహాడ్–అనంతారం రహదారి వంతెన
- పాకురుపట్టి జారిపడుతున్న పాదచారులు, వాహనదారులు


పొట్లపహాడ్ శివారులోని లోలెవల్ వంతెన

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండలం పొట్లపహాడ్ గ్రామ శివారులోని లోలెవల్ వంతెన ప్రయాణికులకు, రైతులకు ప్రమాదకరంగా మారింది. పొట్లపహాడ్–అనంతారం గ్రామాల ప్రధాన రహదారిపై ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఈ వంతెన ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, నాగార్జునసాగర్ కాలువ నుంచి వస్తున్న నీటి కారణంగా వంతెనపై పాకురు (నాచు) పేరుకుపోయింది. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాకుండా, వంతెన కింది భాగం పూర్తిగా దెబ్బతిని, పెద్ద పగుళ్లు తేలాయి. దీనివల్ల వాహనాలు మరింత అదుపు తప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ మార్గంలో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వర్షాలొస్తే రాకపోకలు బంద్..

వర్షాలు పడితే ఈ లోలెవల్ బ్రిడ్జి పరిస్థితి మరీ దారుణంగా మారుతుంది. వరదల కారణంగా వంతెన మునిగిపోతుండటం వల్ల ఆ సమయంలో ప్రయాణం పూర్తిగా నిలిచిపోతోంది. సాగర్ కెనాల్ నీటి ప్రవాహం కూడా దీనికి తోడై రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఈ వంతెన మీదుగా ప్రయాణించాలంటేనే భయంగా ఉందని ద్విచక్ర వాహనదారులు, స్థానిక రైతులు వాపోతున్నారు. ప్రమాదకరంగా మారిన ఈ వంతెనపై అధికారులు వెంటనే దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని.. పాకురును తొలగించి, పగుళ్లను మరమ్మతు చేయించాలని, హై లెవెల్ వంతెన నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలి

తరచూ వరదల్లో మునుగుతూ, ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ లోలెవల్ వంతెన స్థానంలో నిధులు మంజూరు చేసి తక్షణమే కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలి. సరైన వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో రైతులు, ప్రయాణికులు కొన్నేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, ప్రయాణికుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని హైలెవల్ వంతెన నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించాలి.

– నాగయ్య, రైతు, పొట్లపహాడ్

ప్రమాదాల బారినపడుతున్నాం

లోలెవల్ వంతెనపై పాకురు (నాచు) ఏర్పడటంతో దానిపై ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వెంటనే హైలేవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఈ సమస్యను పరిష్కరించాలి.

– వెంకన్న, ప్రయాణికుడు, అనంతారం

క్లుప్తంగా

గర్భిణులకు వైద్యశిబిరం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నగేష్

అర్వపల్లి : సహజ కాన్పుల ద్వారా మహిళలకు అనేక ప్రయోజనాలు ఉంటాయని మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేయాలని సూచించారు. పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, నర్సింగ్ అధికారులు సునీత, మాధవి, ఎల్‌టీ చొక్కయ్య, అనూష, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామానికి చెందిన మల్లెబోయిన సోమయ్య ఇటీవల మృతిచెందారు. దీంతో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం మృతుడి కుటుంబీకులకు వేర్వేరుగా రూ.10 వేల ఆర్థికసాయం, బియ్యం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బాసపోలు శ్రీనివాస్, బౌరోజు ఉపేందర్, భన్వరి ఉపేందర్, గుట్టయ్య, కుక్కడపు సైదులు, శ్రీనివాసరెడ్డి, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వీరభద్రం, వీరారెడ్డి, సాయిలు, సోమిరెడ్డి, వీరేష్, లక్ష్మణ్, ప్రశాంత్, డాక్టర్ లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం వారోత్సవాలు


అర్వపల్లిలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

అర్వపల్లి : అర్వపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సమాచార హక్కు చట్టం –2025 వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, గిర్దావర్లు రామరాజు జలేందర్‌రావు, పాటి వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పెరుమాళ్ల ప్రసన్న, ఏఎస్‌ఓ సైదిరెడ్డి, సిబ్బంది, జీపీఓలు పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

నడిగూడెం : ప్రేమ పేరుతో యువతిని వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం నడిగూడెం ఎస్ఐ గండమళ్ల అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండల కేంద్రానికి చెందిన వట్టె మౌనిక అనే యువతిని నడిగూడెంకు చెందిన శ్రీరాములు సంతోష్ గత కొద్ది రోజులుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు పరామర్శ

కోదాడరూరల్ : అనంతగిరి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కందికొండ శ్రీనివాస్ ఇటీవల విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగి ఇంటి వద్ద చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఆయనను మున్నూరుకాపు పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ పరామర్శించారు. కార్యక్రమంలో జేవీఆర్, గాలి శ్రీనివాస్, కొత్త లక్ష్మణ్ పటేల్, శనగల జగన్, శెట్టి విజయ్‌భాస్కర్, తోట శ్రీనివాస్, హన్మంతరావు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబన్న ఆశయాలు సాధిద్దాం

కోదాడరూరల్ : స్వాతంత్య్ర పోరాట యోధుడు వడ్డెర ఓబన్న ఆశయాలు సాధిద్దామని పలువురు వడ్డెర సంఘం నాయకులు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలో వడ్డెర ఓబన్న వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బలహీన వర్గాల్లో పుట్టిన ఓబన్న భారత స్వాతంత్య్ర ఉద్యమంలో బ్రిటిష్ వారిపై అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వంటిపులి వెంకటేష్, బత్తుల ఉపేందర్, చింతల నాగేశ్వరరావు, చింతల లింగయ్య, వంటిపులి శ్రీనివాస్, ఓర్సు దుర్గారావు, ఉప్పతల కోటేశ్వరరావు, బండ్ల దాసు పాల్గొన్నారు.


విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్మశానవాటికలో వసతులు కల్పించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : పట్టణంలోని 22వ వార్డు జమున నగర్ శ్మశానవాటికలో వసతులు కల్పించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వం మందుల సంఘం వారికి జమున నగర్‌లో శ్మశానవాటిక కోసం స్థలం మంజూరు చేసిందని, కానీ వసతులు కల్పించకపోవడంతో ఆ భూమిలో కంపచెట్లు పెరిగాయని తెలిపారు. విష సర్పాలు సంచరిస్తున్నందున స్థానికులు అక్కడికి వెళ్లాలంటేనే భయపడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మించి, గేట్ ఏర్పాటు చేయాలని, నీటి వసతి కోసం బోర్ వేయించి కరెంటు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కార్యదర్శి పెంద్ర కృష్ణ, మైనార్టీ జిల్లా నాయకుడు ఎండీ పాషా, మహిళా సంఘం నాయకురాలు దేశగాని హేమలత, పెంద్ర చిన్న, గూడేలి శివ, పెంద్ర ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనులు చేయొద్దు


పనులను అడ్డుకుంటున్న స్థానికులు

సూర్యాపేట అర్బన్ : జిల్లా కేంద్రంలో ప్రణాళిక లేకుండా చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ పనులను నిలిపివేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని 45వ వార్డులో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైయినేజ్ పనులను ఆయన అడ్డుకొని మాట్లాడారు. అండర్ గ్రౌండ్ డ్రైయినేజ్ పనులతో ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్నారని, ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ కోసం పెద్దపెద్ద గుంతలు తీసి చిన్న పైపులు వేసి నామమాత్రంగా పూడ్చి వెళ్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కుక్కడపు భిక్షం, వెంకటేష్, సందీప్, వార్డు పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి దామోదర్ రెడ్డికి నివాళి


చివ్వెంల : సూర్యాపేటలో ఆర్డీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు


తుంగతుర్తి : నివాళులర్పిస్తున్న నాయకులు

చివ్వెంల: మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ సోమవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులకు గైర్హాజరు అయ్యారు. అనంతరం బార్ అసోసియేషన్ హాల్‌లో ఆర్డీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, ఉపాధ్యక్షుడు గుంటూరు మధు, న్యాయవాదులు నూకల సుదర్శన్ రెడ్డి, వీవీరావు, బాణాల విజయ్ కుమార్, రఘుపతిరెడ్డి, బత్తిని వెంకటేశ్వర్లు, టేకులపల్లి శ్రీనివాస్‌రావు, మోదుగు వెంకట్ రెడ్డి, ఎండీ.ఫరిదొద్దీన్, మారపాక వెంకన్న, సోమేశ్వర్‌రావు, నారాయణ, ఏడిండ అశోక్, తాళ్లపల్లి సత్యనారాయణ, కారింగుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దామోదర్ రెడ్డి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సంకేపల్లి కొండల్ రెడ్డి, ఎల్సోజు ఉప్పలయ్య ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


తుంగతుర్తి : బందరామారం గ్రామంలో కళాజాత నిర్వహిస్తున్న కళాబృందం సభ్యులు


నాగారంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాబృందం

తుంగతుర్తి : పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత అని తెలంగాణ సాంస్కృతిక కళాబృందం జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బందరామారం గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. లేనిపక్షంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారథి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెల రాము, టీం లీడర్ పల్లెల లక్ష్మణ్, గంట భిక్షపతి, గడ్డం ఉదయ్, డప్పు శంకర్, పాక ఉపేందర్, మద్దిరాల మంజుల, సిరిపంగి రాధ, కుందమల్ల నాగలక్ష్మి, ములకలపల్లి మల్లమ్మ, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ యనగందుల నాగరాజు అన్నారు. నాగారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం నాగారం ఎక్స్ రోడ్డు వద్ద ప్రజలకు సీజనల్ వ్యాధులపై కళాబృందం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలంలో ఇళ్ల పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయని, అవి కుట్టడం వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోధకాలు, మెదడు వాపు వంటి వ్యాధులు సోకుతాయని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.విమలమ్మ, సూపర్‌వైజర్ రామచంద్రు, వైద్యసిబ్బంది, కళాబృందం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

అర్వపల్లి : కేంద్ర ప్రభుత్వం పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన పథకాలను సిబ్బంది ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చేర్పించాలని సూర్యాపేట డివిజన్ తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్(ఐపీఓ) బుచ్చిబాబు కోరారు. అర్వపల్లిలోని సబ్‌పోస్టాఫీసులో సోమవారం బీపీఎంలు, ఏబీపీఎంలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్పీఎం దయాకర్, మేల్ ఓవర్సీస్ సుధీర్‌బాబు, అప్పయ్య, బీపీఎంలు, ఏబీపీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకం


నగదు ప్రోత్సాహకం అందుకున్న విద్యార్థులు

సూర్యాపేట టౌన్: 2024–25 సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిటీ టాలెంట్ స్కూల్ విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ ఆర్.ప్రకాష్ రెడ్డి సోమవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఎస్.సాయి సృజన, బి.ప్రణవి, జి.శ్రీజ, పి.హర్షిత, వై.ప్రజ్ఞ, వై.శిశిర, ఎన్.సుదీప, ఎస్.సాయి గోకుల్, కాశ్యాప్ రామ్‌లకు నగదు చెక్కులు అందజేసి అభినందించారు. అనంతరం పాఠశాల కరస్పాండెట్ ఆర్.ప్రకాష్ రెడ్డి మాట్లాడారు. పూర్వ విద్యార్థులు, రోళ్లకంటి లక్ష్మీరాంరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రతిభా పురస్కారాలు ప్రతి ఏటా అందిస్తామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, సిటీ టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఆత్మకూర్ (ఎస్) : బిక్కేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆత్మకూర్(ఎస్) మండల ఎస్ఐ బి.శ్రీకాంత్ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోతె మండల పరిధిలోని నర్సింహపురం గ్రామానికి చెందిన నాలుగు ట్రాక్టర్లలో ఎలాంటి అనుమతి లేకుండా సోమవారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తుండగా ఆత్మకూరు పరిధిలోని శెట్టిగూడెం శివారులో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గుండెపోటుతో చివ్వెంల మాజీ ఎంపీపీ మృతి


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చివ్వెంల : చివ్వెంల మండల తొలి ఎంపీపీ, సీపీఎం సీనియర్ నాయకుడు ఇట్టమళ్ల ఏసోబ్ (70) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. అతడి మృతదేహాన్ని పలువురు సీపీఎం నాయకులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, పారెపల్లి శేఖర్‌రావు, కోదమగుండ్ల నాగేష్, మేకనబోయిన శేఖర్, ఎల్గూరి గోవింద్, చెరుకు సత్యం, మడ్డి అంజిబాబు, బొమ్మిడి లక్ష్మీ నారాయణ, వజ్జె వీరయ్య, భగత్ సింగ్, స్టాలిన్, పల్లేటి వెంకన్న, బచ్చలకూరి రాంచరణ్, కలగాని సోమయ్య, కొల్లూరి బాబు, వల్లపుదాసు జానయ్య, పారెపల్లి వెంకయ్య, కాంపాటి అబ్రహం, బొప్పని సులేమాన్ తదితరులు ఉన్నారు.

యూరియా కోసం రోజంతా క్యూలోనే..


తిమ్మాపురం రైతువేదిక వద్ద యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

అర్వపల్లి : తిమ్మాపురం పీఏసీఎస్‌కు సోమవారం 444 బస్తాల యూరియా రాగా మండల వ్యాప్తంగా రైతులు అక్కడికి వెళ్లారు. రోజంతా క్యూలోనే ఉన్నారు. అయితే రైతుకు బస్తా చొప్పున యూరియా నుపంపిణీ చేశారు. క్యూలో ముందున్న వారికి యూరియా దొరికింది. మరికొంత మంది రైతులకు దొరక్క వెనుదిరిగిపోయారు. ఎస్ఐ ఈట సైదులు, ఏఎస్ఐ రామకోటిల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పంపిణీలో ఏఓ గణేష్, ఏఈఓ ఎస్.సత్యం, పీఏసీఎస్ సీఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

శిథిలావస్థలో భవనం.. సేవలకు ఆటంకం


అర్వపల్లిలోని పశువుల ఆస్పత్రి భవనంపై పెరుగుతున్న చెట్లు

అర్వపల్లి : అర్వపల్లిలోని పశువైద్యశాల భవనం 50 ఏళ్ల కిందట నిర్మించింది కావడంతో శిథిలమై ఏ క్షణంలోనైనా కూలేదశకు చేరింది. దీంతో పశువైద్య సిబ్బంది క్షణక్షణం భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడం, దీనికి తోడు హైవేరోడ్డు ఎత్తుపెంచడంతో ఆస్పత్రి భవనం లోతట్టు ప్రాంతంలో ఉండిపోయింది. ఏ చిన్నపాటి వర్షం వచ్చినా ఆస్పత్రి భవనం మొత్తం నీటితో నిండిపోతోంది. దీంతో వర్షాలు పడిన ప్రతిసారి వైద్య సేవలు నిలిచిపోతున్నాయి. అధికారులు స్పందించి శిథిలమైన భవనాన్ని తొలగించి, నూతన పశువైద్యశాలను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

నిత్యం ఇబ్బందులు

అర్వపల్లిలో పశువైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో వైద్యసేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పశువుల ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, కొత్తభవనం నిర్మించాలని జీఎంపీఎస్ ఆధ్వర్యంలో అనేకసార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– వినయ్‌యాదవ్, జీఎంపీఎస్ నాయకుడు

కలప స్మగ్లర్.. సూర్యాపేట వాసి

- ఖమ్మం జిల్లా నుంచి తప్పుడు సమాచారంతో ఎన్‌ఓసీలు
- ఆపై విలువైన సంద్ర కలప అక్రమ రవాణా
- ఎన్‌ఓసీల సృష్టికర్త చింతకాని బీట్ ఆఫీసర్

ఖమ్మం వ్యవసాయం : కలప రవాణాకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, అందులోని లొసుగుల ఆధారంగా సాధారణ కలప స్థానంలో విలువైన సంద్ర కలపను రవాణా చేసిన స్మగ్లర్‌ను ఎట్టకేలకు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ స్మగ్లర్ విలువైన కలపను నకిలీ ధ్రువపత్రాలతో పొరుగు రాష్ట్రాలకు రవాణా చేస్తున్నట్లు విచారణలో తేల్చారు. నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్(ఎన్‌టీపీఎస్) విధానాన్ని ఆసరాగా చేసుకుని అనుమతి ఉన్న కలప మాటున విలువైన కలపను ఉత్తరాది రాష్ట్రాలకు తరలిస్తున్న వ్యవహారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అటవీ అధికారుల తనిఖీల్లో బయటపడింది. ఆపై తీగ లాగితే డొంక కదిలిన చందంగా వ్యవహారమంతా బయటకు వచ్చింది. ఈమేరకు వివరాలను సోమవారం ఖమ్మం జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ వెల్లడించారు.

గతనెల 24నుంచి విచారణ..

ఖమ్మం జిల్లా నుంచి సాధారణ కలపను రవాణా చేసేందుకు ఎన్‌టీపీఎస్ ద్వారా అనుమతి తీసుకుని విలువైన సంద్ర కలపను ఉత్తరాది రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. ఈ కలపను అక్కడి పాన్ మసాలా తయారీ ఫ్యాక్టరీల్లో ఉపయోగిస్తుండగా మధ్యప్రదేశ్‌లో చేపట్టిన తనిఖీల్లో అక్రమాలు బయటపడ్డాయి. దీంతో ఆ రాష్ట్ర అధికారులు ఇచ్చిన సమాచారంతో ఖమ్మం జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ నేతృత్వాన గతనెల 24 నుంచి విచారణ చేపట్టారు. ఈమేరకు సూర్యాపేట జిల్లాకు చెందిన కలప స్మగ్లర్ చింతకాని ఇన్‌చార్జి బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ ద్వారా కలప రవాణాకు సంబంధించి ఎన్‌ఓసీ తీసుకుని విలువైన కలప అక్రమ రవాణా చేసినట్లు తేల్చారు. మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి సంద్ర కలప సేకరించగా.. ఆపై చింతకాని మండలం నుంచి సర్కారీ తుమ్మ తరలిస్తున్నట్లు అనుమతి తీసుకుని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి పంపించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన స్మగ్లర్ అదే జిల్లా మోతె మండలానికి చెందిన ఓ లారీ ఏజెంట్ సహకారంతో కలపను ఉత్తరాది రాష్ట్రాల్లో ఉన్న పాన్ మసాలా పరిశ్రమలకు తరలిస్తుండగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝబువా, అలీపూర్ జిల్లాల్లో గుర్తించారు. కలప డీలర్లు, ప్రైవేట్ ఏజెంట్లతో చేయి కలిపినట్లు తేలడంతో ఇప్పటికే చింతకాని బీట్ ఆఫీసర్ శ్రీకాంత్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. కాగా, కలప అక్రమ రవాణా వ్యవహారంపై ‘సాక్షి’లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అయితే, ఖమ్మం జిల్లా పేరిట అనుమతి తీసుకున్నా సంద్ర కలప సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి తరలించినట్లు తేలడంతో ఆయా జిల్లాల అధికారులకు సమాచారం ఇచ్చారు. అంతేకాక ఉన్నతాధికారులకు ఖమ్మం డీఎఫ్‌ఓ నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మూడు జిల్లాల అధికారులకు సమాచారం ఇచ్చారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ ఎప్పుడో..

- మద్దిరాలలో పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- సొంతింటి కల సాకారం కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలు
- త్వరగా పంపిణీ చేయాలని అధికారులకు వేడుకోలు


మద్దిరాలలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

మద్దిరాల : మండలంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా పంపిణీకి నోచుకోవడంలేదు. ఇళ్లు ఎప్పుడు పంపిణీ చేస్తారో అని దరఖాస్తుదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మద్దిరాలలో మొత్తం 75 డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పనులను 2015 నవంబర్‌లో ప్రారంభించారు. ఒక్కో ఇంటికి రూ.5.4 లక్షలు కేటాయించారు. అయితే ఆ ఇళ్ల నిర్మాణాలు పూర్తయి దాదాపు 10సంవత్సరాలు గడుస్తోంది. ఇళ్లు పంపిణీకి నోచుకోకపోవడంతో డోర్లు, కిటికీలు ధ్వంసం అవుతున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. చివరకు విసుగుచెందిన పలువురు ఇళ్లులేని నిరుపేదలు ఇటీవల ఆ ఇళ్లను ఆక్రమించుకుంటామని ఆందోళనలు నిర్వహించారు. అయితే స్థానిక పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళనలను విరమింపజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఇళ్లను పంపిణీ చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ఆశగా ఎదురుచూస్తున్నారు



మద్దిరాల గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఇళ్లు లేని నిరుపేదలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఇళ్లు లేని వారు ప్రతిఏడాది వర్షాలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. అంతేకాకుండా ఇళ్ల పరిసరాల్లో పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా వెంటనే ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలి.

– వడ్డాణం కిరణ్, మద్దిరాల

రిజర్వేషన్ కల్పించాలని వినతి


కోదాడ : కోదాడ మండలం గుడిబండ గ్రామ పంచాయతీ పరిధిలోని 12వ వార్డులో ఎస్టీలు అధికంగా ఉన్నందున 12వ వార్డును తమకు రిజర్వు చేయాలని ఆ వార్డుకు చెందిన పలువురు సోమవారం జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. గడిచిన 40 సంవత్సరాల్లో తమ వార్డు ఏనాడూ ఎస్టీ రిజర్వేషన్ రాలేదని తెలిపారు. ఎన్నికల్లో వార్డు స్థానం తమకు రిజర్వు చేయకపోవడంతో రాజకీయ అవకాశాలను కోల్పోతున్నామని, అధికారులు రిజర్వేషన్‌ను పునపరిశీలించాలని వారు వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గోపి, రాజేష్, ప్రభుదేవ, కార్తిక్ ఉన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- భర్త, అత్తమామలపై కేసు నమోదు

నడిగూడెం : అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న భర్తతో పాటు, అత్త, మామపై నడిగూడెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్ఐ గండమళ్ల అజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామానికి చెందిన గుర్రం వెంకటరెడ్డి, ప్రమీల దంపతుల పెద్ద కూతురు లావణ్యతో ఆత్మకూరు (ఎస్) మండలం కోటపహాడ్‌కు చెందిన కందాల రేణుక, లింగారెడ్డిల కుమారుడు రాజశేఖర్‌రెడ్డికి 2023 మేలో పెళ్లి జరిగింది. అప్పటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని లావణ్యను తన భర్త రాజశేఖర్ రెడ్డి, అత్త రేణుక, మామ లింగారెడ్డిలు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కరాటే పోటీల్లో ప్రతిభ


క్రాంతికుమార్

కోదాడ : చైన్నైలోని ఎస్ఐవీఈటీ కళాశాలలో అక్టోబర్ 5న జాతీయ స్థాయిలో జరిగిన కరాటే వరల్డ్ రికార్డు అటెంప్ట్ పోటీల్లో కోదాడకు చెందిన యువకుడు ప్రతిభ చూపి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. కోదాడ సమీపంలోని ఖానాపురానికి చెందిన క్రాంతికుమార్ మార్షల్ ఆర్ట్ (కరాటే) లో కొంత కాలంగా ప్రతిభ చూపుతున్నాడు. ఈ క్రమంలో చెన్నైలో జరిగిన పోటీలలో వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు పాల్గొన్నారని, ఆ పోటీలలో ప్రతిభ చూపి పతకాన్ని కైవసం చేసుకున్నానని ఆయన తెలిపారు.